క్లుప్తంగా

రేపటి నుంచి శ్రీలక్ష్మీ మహాయజ్ఞం



పరీక్షిత్‌రాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ట్రస్టు బాధ్యులు బలరాంనాయుడు

జియ్యమ్మవలస: దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అష్టోత్తర శతకుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం ఈ నెల 12 నుండి 17వ వరకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం విజయవాడలో నిర్వహించనున్నట్లు ట్రస్టు బాధ్యులు మరిశర్ల బలరాంనాయుడు తెలిపారు. బుధవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లి ఆహ్వాన పత్రికలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు బుధవారం తన స్వగృహంలో అందజేసి కార్యక్రమానికి హాజరవ్వాలని కోరారు.

బాధితునికి ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని కొండవీధికి చెందిన నిమ్మక నాగభూషణ్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇబ్బందులు పడుతున్నాడు. దీన్ని గమనించిన కాలనీ వాసులతో పాటు స్నేహితులు చేయూతనందించారు. ఈ మేరకు వారంతా చందాలు పోగు చేసుకొని రూ.11,800లు నగదుతో పాటు బియ్యం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్‌ల చేతుల మీదుగా బాధితునికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వీధి పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన సంబరాలు



బంగారమ్మ తల్లి వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

భామిని: మండలంలోని నేరడి బీలో బంగారమ్మతల్లి అమ్మవారి సంబరాలు బుధవారం ముగిశాయి. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు ముందస్తుగా ఘటాలతో ఊరేగింపుగా వెళ్లారు.

ఆధ్యాత్మిక శోభ



నవగ్రహ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు, దంపతులు

పాలకొండ రూరల్: నక్కలపేటలో కొలువుదీరిన షిర్డీసాయి మందిరంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సాంప్రదాయబద్ధంగా జరుగుతున్నాయి. ప్రముఖ యజ్ఞకర్త, వేదపండితులు శర్మయాజీ నేతృత్వంలో బుధవారం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ క్రమంలో నిర్వహించిన సామూహిక పూజల్లో దంపతులు, భక్తులు పెద్దెత్తున పాల్గొన్నారు. అనంతరం మందిర ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. రెండురోజులుగా జరుగుతున్న ప్రతిష్ఠ ఉత్సవాలతో పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

బలిజిపేట: మండలంలోని వెంగాపురం మాజీ సర్పంచ్ జి.అప్పలనాయుడు జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన విగ్రహాన్ని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మంచి నాయకుడిని ప్రజలు ఆదరిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అమ్మడమ్మ, ఎంపీపీ నాగమణి, ఎంపీటీసీ మురళి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, బి.కాశినాయుడు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక పరిశీలన

మక్కువ: స్థానిక ఎస్.ఎస్.పాఠశాలలో జగనన్న విద్యాకానుక స్టోరేజీ రూమ్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. జగనన్న విద్యాకానుక కిట్లను సక్రమంగా విద్యార్థులకు అందించేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు

- పారదర్శక పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం
- ఎమ్మెల్యే కళావతి



లబ్ధిదారుకు అభివృద్ధి, సంక్షేమ కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: రాష్ట్రంలో ప్రతీ గ్రామం అభివృద్ధి పథంలో దూసుకువెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కోతాం గ్రామ సచివాలయం పరిధిలో దబర, బెన్నడుగూడ, కుమ్మరిగండి తదితర గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికి వెళ్లి గత నాలుగేళ్లగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటుగా పథకాలు ఎలా అందుతున్నాయనేది అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, నిత్యం ప్రజలు సంతోషంగా ఉండే విధంగా అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక వసతులైన రహదారులు, తాగు నీరు, డ్రైనేజీ సౌకర్యాలు, వరదగోడలు కల్పిస్తున్నామన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, ఎస్.రమేష్, కృష్ణ, సింహాచలం, వెంకి తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం చేయండి



బత్తిలి వద్ద సర్వే రాళ్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

భామిని: మండలంలోని బత్తిలి, బొమ్మిక, పక్కుడుబద్ర గ్రామాల్లో జరుగుతున్న సరిహద్దు కొలత రాళ్ల పాతించే కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ నూరల్ కమర్ బుధవారం పరిశీలించారు. శాశ్వత భూ హక్కు - శాశ్వత భూ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం చేయాలన్నారు. రైతులకు తన జిరాయితీ భూముల వివరాలు తెలియచేసి సరిహద్దు కొలత రాళ్ల వేయడంతో భవిష్యత్తులో భూ వివాదాలకు తావుండదన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నీలాపు అప్పారావు, సర్వేయర్ తోట రామ్మోహనరావు, వీఆర్‌ఓలు దుర్గాప్రసాద్, సిర్ల జయరాజు, మోహనదాస్, సహాయ సర్వేయర్లు ఉన్నారు.

సకాలంలో ఎస్‌జీడీ సర్వే పూర్తి చేయాలి



లుంబూరు సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: సచివాలయాల సిబ్బంది సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌జీడీ) సర్వే సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. పాలకొండ మండలం లుంబూరు, ఓని, ఎం.సింగుపురం సచివాలయాలను ఆయన బుధవారం సందర్శించారు. క్షేత్ర స్థాయిలో సర్వే ప్రాప్తికి నమోదు చేస్తున్న వివరాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. సిబ్బంది అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న క్రమంలో గ్రామీణులను అప్రమత్తం చేయాలని, ఫీల్డ్ సిబ్బందికి సూచించారు. అలాగే ఉపాధి పనుల పురోగతిపై ఆరా తీశారు.

ఏనుగుల సంచారంపై సమాచారమివ్వాలి



కురుపాం మండలంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కురుపాం: నియోజకవర్గంలో కొన్నేళ్లుగా తిష్ట వేసిన ఏనుగులకు సంబంధించి సంచారంపై అటవీ శాఖ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. అవి సంచరించే ప్రాంతాల్లో ఉన్న గ్రామాల ప్రజలకు ముందస్తుగా అప్రమత్తత చేయడం వల్ల ప్రాణ హాని లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. పొలం పనులకు వెళ్తున్న సమయంలో రైతులు ఏనుగుల దాడిలో మృత్యువాత పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఏనుగుల సంచారానికి సంబంధించిన సమాచారం ప్రజలకు చేర్చి చైతన్యపరచాలన్నారు. ప్రస్తుతం ఏనుగుల గుంపు కురుపాం మండలంలోని గుజ్జుపాడు, కొమరాడ మండలంలోని వన్నాం పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అడవులను కాపాడుకుందాం..



జేకేపాడు టేకు ప్లాంటేషన్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అడవులను కాపాడుకుందామని అటవీశాఖ కురుపాం రేంజర్ రాజాబాబు అన్నారు. మండలంలోని జేకే పాడు గ్రామ సమీపంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన టేకు ప్లాంటేషన్ వద్ద లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాన్ని అటవీశాఖ అధికారులు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రేంజర్ అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ప్రతిజ్ఞ చేయించారు. ప్లాంటేషన్ చుట్టూ పెరిగిన తుప్పలు, ఇతర మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాన్ని ఇష్టానుసారంగా వాడేయడం, నిప్పుపెట్టడం, చెట్లను నరికేయడం వలన పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. ఈ పరిస్థితుల్లో మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరిక్షించుకోవాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిలో ఉండంటూ పలు సూచనలు చేశారు. సెక్షన్ ఆఫీసర్ ఎస్.భాస్కరరావు, బీట్ ఆఫీసర్లు ఎన్.రామారావు, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ



రెడ్డి తిరుపతి నాయుడుతో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సాలూరు: కరోనా నేపథ్యంలో గత సంవత్సరం మృతిచెందిన వైఎస్సార్‌సీపీ సాలూరు మండల అధ్యక్షుడు సువ్వాడ రమణ కుటుంబాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర బుధవారం పరామర్శించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న సాలూరు మాజీ జెడ్పీటీసీ రెడ్డి తిరుపతి నాయుడుని ఆయన స్వగ్రామం బాగువలస వెళ్లి పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైఎస్సార్ సీపీ మక్కువ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, మక్కువ జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు నాయుడు, సాలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంత కుమారి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి విగ్రహావిష్కరణ

సాలూరు మండలంలోని మామిడిపల్లికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సువ్వాడ తౌడు కరోనాతో గత ఏడాది మృతిచెందిన నేపథ్యంలో ఆయన కుమారులు మామిడిపల్లిలో ఏర్పాటుచేసిన కాంస్య విగ్రహాన్ని డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.

వేగవంతంగా గృహ నిర్మాణాలు

పాలకొండ: జగనన్న కాలనీలో గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. పట్టణంలో సచివాలయాల సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు అన్ని విధాల ప్రభుత్వం నుంచి సహకారం అందుతుందని, ఈ అవకాశం వినియోగించుకోవాలని సూచించారు. నిర్మాణం చేపట్టిన వారికి వెంటనే బిల్లులు చెల్లింపు చేస్తున్నామని వివరించారు. ఈ నెల 30 నాటికి శత శాతం నిర్మాణాలు పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టీవీగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, పిట్టర్, మెకానిక్ మోటర్‌వెహికల్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్ సీట్లు భర్తీ చేయనున్నామన్నారు. ఆన్‌లైన్‌లో ఐటీఐ.ఏపీ.గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 7569062449, 9948582309 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం

పాలకొండ: నగర పంచాయతీకి దశాబ్దలుగా వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. మండలంలోని అట్టలి గ్రామ సమీపంలో టీడీపారాపురం వద్ద డంపింగ్ యార్డు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సుమారుగా 5ఎకరాల స్థలం ఇందు కోసం కేటాయించారు. ప్రభుత్వం నుంచి రూ. 60లక్షలు మంజూరు కావడంతో బుధవారం నుంచి పనులు చేపట్టారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కమిషనర్ సర్వేశ్వరరావులతో పాటుగా పలువురు కౌన్సిలర్లు స్థలం పరిశీలించి నిర్మాణం కోసం సూచనలు అందించారు. బోరు ఏర్పాటు చేయడంతో పాటుగా ప్రహరీ నిర్మాణం, షెడ్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ విక్రాంత్ కాంట్రాక్టర్‌కు సూచించారు.

ముగిసిన పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు



ఉత్సవ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: పది రోజులుగా జరుగుతున్న వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఇక్కడకు వచ్చిన వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన విందులో పాల్గొని సహపంక్తి భోజనాలు చేసి అందరినీ ఆనందింపజేశారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఉత్సవ కమిటీ సభ్యుల ఇంటికి వెళ్లి తేనేటి విందు స్వీకరించి అందరినీ పలకరించారు. అంతకు ముందు ఉత్సవ కమిటీ సభ్యులు ఊరిలో ఉన్న అమ్మవారిని సంప్రదాయ ప్రకారం వనంలోకి తీసుకువెళ్లి పూజలు చేశారు. తమ బంధువుల ఇంటికి వచ్చిన చుట్టాలు, బంధువులు, మిత్రులు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ప్రధాన రహదారితో పాటు, బార్నాలవీధి రోడ్డు, కొత్త బస్టాండ్ రోడ్డులో పెద్ద ఎత్తున ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో పోలీసులు క్లియర్ చేశారు. ఏడేళ్ల తర్వాత చేపట్టిన వీరఘట్టం అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించడంపై ఉత్సవ కమిటీని అందరూ అభినందించారు.

గొర్రెల్లో కాలిపుండు వ్యాధి



వర్షాల్లో తడిచే ఈతరహా గొర్రెలకు వ్యాధులు సోకే అవకాశం

- ముందుగా గుర్తించకుంటే మిగిలిన జీవాలకు వ్యాప్తి

పాలకొండ రూరల్: వేసవిలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదముందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ప్రభా మాణిక్యరావు అన్నారు. నియోజకవర్గ పరిధిలో దాదాపు 63,349 గొర్రెలు ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. మేతకు వెళ్లే గొర్రెల మందలు వర్షాల్లో తడవటం, మురికి కుంటల్లో, నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం నిలిచి ఉండటం వలన సూక్ష్మ జీవులు వాటి కాళ్ల ఆశించి వ్యాధి బారిన పడతాయి. చిత్తడి నేలల్లో తిరగటం వలన ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. దీనిని ముందుగా గుర్తించకుంటే అతిత్వరగా మందలో మిగిలిన వాటికి వ్యాపిస్తుంది.

వ్యాధి లక్షణాలు – నివారణ

ఈ వ్యాధి సోకిన గొర్రెలు తొలిత మిగిలిన వాటి కంటే నడకలో వెనుక పడతాయి. సరిగా నడవలేక ఇబ్బందులు పడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్లు ఉంటే కాలిపుండు వచ్చినట్లు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగా మేత మేయవు, బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పడుతుంది. తీవ్రమైన చెడువాసన వస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంది. ఈ తరహా వ్యాధి లక్షణాలు గొర్రెల్లో గుర్తిస్తే తక్షణమే స్పందించాలి. వ్యాధి సోకిన గిట్టలకు 10 శాతం మైలతుత్తము ద్రావణంతో లేదా 10 శాతం జింకు సల్ఫేట్ ద్రావణంతో లేక 5 శాతం ఫార్మలిన్ ద్రావణంలో నడిపించటం ద్వారా వాటి కాళ్లను శుభ్రం చేయాలి. రోజుకు రెండు సార్లు చేయటం వలన ఫలితం ఉంటుంది. వైద్యుల సూచనల మేరకు యాంటీబయాటిక్ మందులను దాదాపు 30 రోజుల వరకు పూతపూయాలి. అదనంగా పెరిగిన గిట్టలను కత్తిరించాలి. తద్వారా దీన్ని నివారించవచ్చు.

దోమల నివారణతో మలేరియాకు చెక్



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌యూఓ అప్పారావు

భామిని: మలేరియా జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్న హైరిస్క్ గ్రామాల్లో దోమల నివారణకు మందు పిచికారీ తప్పని సరిగా చేయించుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు బుధవారం సూచించారు. బాలేరు పీహెచ్‌సీ పరిధి నల్లరాయిగూడలో గిరిజనులకు దోమల మందు పిచికారీపై అవగాహన కల్పించారు. జూన్ -1 నుండి 8వ తేదీలోగా విధిగా పిచికారీ చేయాల్సి ఉందన్నారు. ప్రధానంగా హైరిస్క్ గ్రామాలైన కోటకొండ, భూర్జగూడ, ఏటంగూడ, బొడ్డగూడ, నల్లరాయిగూడ, పోలవరం, కొరమ కాలనీలు గుర్తించినట్లు వివరించారు. ఆయన వెంట బాలేరు ఎంపీహెచ్‌ఈఓ జామి పద్మరాజు, వైద్య సిబ్బంది, గిరిజనులున్నారు.

పచ్చిరొట్ట సాగుకు వేళాయె..

- ఖరీఫ్‌కు ముందు పచ్చిరొట్ట సాగుతో మేలు
- రాయితీపై విత్తనాలు అందించేందుకు సిద్ధం



ఖరీఫ్‌కు పంట పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు

గరుగుబిల్లి:

రైతులు తమ పంట పొలాల్లో రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల నేల సారం తగ్గడంతో పాటు పలురకాల తెగుళ్లు, పురుగులు సోకడంతో పంట దిగుబడులు గణనీయంగా పడిపోతున్నాయి. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, హరితవిప్లవంలు కారణంగా పంటలలో దిగుబడులను పెంచేందుకు రసాయన ఎరువులు వినియోగంతో పంట దిగుబడులు రెండింతలు పెరిగాయి. దిగుబడులను మూడింతలు పెంచేందుకుగాను రసాయన ఎరువులు మోతాదుకు మించి రైతులు వినియోగించడంవల్ల పంట దిగుబడులు పెరగడంతో పాటు పంటలకు చీడపీడలు అధికంగా పెరిగాయి. మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగించడం వల్ల భూములు నిస్సారంగా తయారయ్యాయి. ఈ కారణంగా పంట పెట్టుబడులు పెరిగిపోయాయి. క్రమేణా భూములు నిస్సారంగా మారడంతో దిగుబడులు కూడా తగ్గాయి. ఎరువులు, పురుగుల మందులు వినియోగంతో భూమిలో వుండే జీవాలు నాశనమై భూసారం కోల్పోతుందని, ఈ విధానాలను విడనాడి భూసారాన్ని పెంచుకోవాలని శాస్త్రవేత్తలు అధికారులు పదేపదే చెబుతున్నా రైతుల ఆలోచనలలో మార్పు రాకపోవడంతో ఏటా అవే ఫలితాలు చూడాల్సి వస్తుంది. ఈ ఏడాదైనా రసాయన ఎరువుల విధానానికి స్వస్తి చెప్పి ప్రకృతి సేద్యం వైపు మరలాలని, దానికోసం ఇప్పటి నుండే భూమిని తయారు చేసుకోవాలంటూ వ్యవసాయ శాఖాధికారులు రైతులకు గ్రామాలలో నిర్వహించే సదస్సులలో వివరిస్తున్నారు. భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట విత్తనాలు ఒక్కటే మార్గమని అందు కోసం ప్రభుత్వం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేస్తుందని వివరిస్తున్నారు. ఖరీఫ్‌కు మరో 40 రోజుల సమయం వున్నందున పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసుకొని భూసారాన్ని పెంచుకోవాలని సూచిస్తున్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో లాభాలు

పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడానికి 45 రోజుల ముందే పొలాల్లో జీలుగు, కట్టి జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడం వల్ల ప్రధాన పంటలకు మేలు జరుగుతుంది. పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడం వల్ల పంట పొలంలో జీవరసాయనిక చర్యల వల్ల నేలసారం క్రమేణా పెరుగుతుంది. వర్షాలు కురిసిన సమయంలో భూమి కోతకు గురికాకుండా అరికట్టవచ్చు. ఈ పంటలను సాగు చేయడంవల్ల నేలలు గుల్లగా మారి నేలలోకి నీరు ఇంకే గుణం పెరుగుతుంది. పంట పొలాలలో కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చు. జీలుగు, కట్టి జనుము వంటి పైర్లు వేసినన ప్పుడు వాటి వేర్లు ఎక్కువ లోతుకు వెళ్లడం వల్ల భూమి లోపల పొరల్లో నిక్షిప్తమైన అనేక పోషకాలు వెలికితెచ్చి పంటకు అందిస్తాయి. నత్రజని శాతం కూడా పెరుగుతుంది.

రాయితీపై విత్తనాల సరఫరా

పచ్చిరొట్ట విత్తనాలు వ్యవసాయ శాఖ 50శాతం రాయితీపై అందజేస్తోంది. జీలుగు విత్తనాలు కిలో ధర రూ.79లు కాగా రూ.39.50లు చెల్లించాల్సి వుంటుంది. ఇవి ఎకరాకు 10 కిలోలు వేసుకుంటే సరిపోతుంది. కట్టిజనుము విత్తనాలు కిలో రూ. 84లు కాగా రాయితీ పోనూ రూ.42లు చెల్లించాల్సి వుంటుంది. ఈ విత్తనాలు ఎకరాకు 16 కిలోలు వేసుకోవాల్సి వుంటుంది. పిల్లిపెసర విత్తనాలు కిలో రూ. 97లు కాగా రాయితీపోను రైతు రూ.50లు చెల్లిస్తే సరిపోతుంది. ఈ విత్తనాలు ఎకరాకు 8 కిలోలు వేసుకోవాలి.



సాగవుతున్న కట్టిజనుము

నియోజకవర్గంలో..

కురుపాం నియోజకవర్గంలోని గరుగుబిల్లి, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస మండలాలలో జీలుగు, కట్టిజనుము, పిల్లి పెసర విత్తనాల కోసం వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ప్రతిపాదనల మేరకు ప్రస్తుతం ఆయా మండల కేంద్రాల్లోని వ్యవసాయ కార్యాలయాలలో విత్తనాలు అందుబాటులో ఉంచారు.

అవకాశాన్ని వినియోగించుకోవాలి..



భూమిని సారవంతంగా తయారు చేసేందుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి. ఈ విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేయడం జరుగుతుంది. పచ్చిరొట్ట విత్తనాలు వినియోగించడంవల్ల నేల సారాన్ని పెంచుకోవాల్సిన అవసరం వుంది. పంట పొలాల్లో వుండే 95శాతం సూక్ష్మజీవులకు పచ్చిరొట్ట విత్తనాలు ఎంతో మేలు చేయడంద్వారా భూమి సారవంతం అవుతుంది.

– ఆర్.విజయభారతి, వ్యవసాయాధికారి, గరుగుబిల్లి